
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 24 సెప్టెంబరు 2024



అధ్వానంగా గ్రామీణ రోడ్లు

జిల్లా వ్యాప్తంగా గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలు కురిస్తే కొన్ని చోట్ల నడక కూడా ఇబ్బందిగా మారుతోంది. అంతర్గత రోడ్లు గుంతలతో నిండిపోయాయి. పలు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో రోడ్లు ఇరుకుగా ఉన్నా యి. గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలుచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- అడుగడుగునా గుంతలు
- వర్షం పడితే తీవ్ర ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రజలు



ఇల్లందకుంట మండలం రాచపల్లి-నాగంపేట గ్రామాల మధ్య ప్రమాదకరంగా రోడ్డు

ప్రయాణం.. నరకప్రాయం



వీణవంక నర్సింగాపూర్ గ్రామాల రోడ్డులో మట్టి పోసి వదిలేసిన కాంట్రాక్టర్

వీణవంక: వీణవంక నర్సింగాపూర్ గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ పనులు రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి మట్టి పోసి వదిలివేయడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. వీణవంక- కనపర్తి రోడ్డు గత సంవత్సరం వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. తాత్కలిక మరమతులు చేసినా ఇటీవల కురిసిన వర్షాలకు పూర్వ స్థితికి వచ్చింది. చల్లూరు నుంచి మాల్లారెడ్డిపల్లి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. మల్లారెడ్డిపల్లి సమీపంలోని మానేరు ఇసుక క్వారీ నుంచి రోజూ వందలాది లారీలు వెళుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

ధ్వంసమైన బీటీ రోడ్లు



నల్ల వెంకయ్యపల్లి నుంచి ప్రధాన రహదారికి వెళ్లే మట్టిరోడ్డు దుస్థితి

శంకరపట్నం: మండల పరిధిలోని గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలతో మట్టి రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని సంవత్సరాల క్రితం వేసిన బీటీ రోడ్లు ధ్వంసమయ్యాయి. మండలంలోని కన్నాపూర్, రాజాపూర్, కాచాపూర్, గద్దపాక గ్రామాల ప్రజలు మండల కేంద్రంతో పాటు ప్రధాన రహదారులను చేరుకోవడానికి పడుతున్నారు. మొలంగూర్ గ్రామపంచా యతీ పరిధిలోని నల్ల వెంకయ్యపల్లె నుంచి కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిని కలిపే మట్టి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వర్షాలు పడినప్పుడు మట్టి రోడ్డు మీద వాహనదారులు జారిపడుతున్నారు.

రహదారులు అస్తవ్యస్తం



మహాత్మానగర్, అలుగునూర్ గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

తిమ్మాపూర్: మండలంలోని చాలా గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా తయారైయ్యాయి. అలుగునూర్ శివారు కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. మండల కేంద్రానికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. పర్లపల్లి నుంచి గట్టుదుద్దెనపల్లికి వెళ్లే రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమైంది. ఇందిరానగర్ నుంచి మన్నెంపల్లి రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది.

● చిన్నపాటి వర్షానికే చిత్తడి

చిగురుమామిడి: మండలంలోని అనేక గ్రామాల్లో చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారాయి. మండలంలోని ఉల్లంపల్లి-సుందరగిరి, పీచుపల్లి- చిగురుమామిడి, బొమ్మనపల్లి-చిగురుమామిడి, కొండాపూర్-ఉల్లంపల్లి, ముదిమాణిక్యం ఎక్స్ రోడ్డు-లంబాడిపల్లి, గాగిరెడ్డిపల్లి-లంబాడిపల్లి, సుందరగిరి-బంజేరుపల్లి, రామంచ-సీతారంపూర్ గ్రామాల రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● ఓవర్‌లోడ్ లారీలతో రోడ్డు ధ్వంసం

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం తనుగుల పరిధిలో ఉన్న గుంపుల ఎక్స్ రోడ్ వద్ద భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఎక్స్ రోడ్ నుంచి గుంపుల ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ఉన్న బీటీ రోడ్డు ఇసుకను తరలిస్తున్న లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్లడంతో పూర్తిగా ధ్వసమైంది. గుంపుల ఎక్స్ రోడ్ నుంచి జమ్మికుంట మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి వైపు పెద్దఎత్తున్న వాహనాలు వెళుతుంటాయి. వాహనాలు గుంతల్లో దిగిన సమయాల్లో పూర్తిగా ఒక పక్కకు ఒరిగిపోతున్నాయి.

● వర్షం కురిస్తే చెరువులుగా మారుతున్న రోడ్లు

రామడుగు: మండలంలోని రహదారులు వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులపై పెద్ద గుంతలు పడి చిరు జల్లులకే చెరువులను తలపిస్తున్నాయి. గోపాల్‌రావుపేట-కరీంనగర్ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గోపాల్‌రావుపేట నుంచి బూరుగుపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. మండలంలో 23 గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గోపాల్‌రావుపేట బస్టాండ్ నుంచి బూరుగుపల్లికి వెళ్లే ప్రధాన రహదారి చిరుజల్లులకే జలమయం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

● శిథిలావస్థలో కల్వర్టు...

ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి-నాగంపేట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. జమ్మికుంట మండలంలోని నాగంపేట శివారు నుంచి రాచపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై 50ఏళ్ల క్రితం కల్వర్టు నిర్మించారు. ఆ కల్వర్టు పూర్తిగా కుంగిపోయింది. వర్షాకాలంలో వరద నీరు కల్వర్టుపై నుంచి పారుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అడుగడుగునా గుంతలు



ఇస్తారుపల్లి వాగుపై తాత్కాలికంగా వేసిన రోడ్డు

గంగాధర: మండలంలో గ్రామీణ, అంతర్గత రోడ్లు గుంతలు పడి ప్రమదాలకు నిలయంగా మారాయి. వాటిలో వర్షపు నీరు నిండి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. లక్ష్మీదేవిపల్లిలోని గంగాధర, పెగడపల్లి మండలాల అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గట్టుబూత్కూర్-ఆచంపల్లి డబుల్ రోడ్డు మూడేళ్లుగా అంసపూర్తిగా ఉంది. గ్రానైట్ లారీలు బురదలో దిగబడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వరదొస్తే ఇస్తారుపల్లి వాగు పొంగి గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

తారు లేచి.. కంకర తేలి



దెబ్బతిన్న అన్నారం - మానకొండూర్ రోడ్డు

మానకొండూర్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని లలితాపూర్ నుంచి దేవంపల్లి మీదుగా కొండపల్కలకు వెళ్లే రహదారి, దేవంపల్లి నుంచి గంగిపల్లి రోడ్డు గుంతలమయంగా మారాయి. అన్నారం నుంచి లింగాపూర్, మానకొండూర్ నుంచి లక్ష్మీపూర్ రోడ్డు వర్షాలకు దెబ్బతిన్నది. పచ్చునూర్ నుంచి ఊటూర్ వరకు రోడ్డు పూర్తిగా చెడిపోయింది. కొండపల్కల నుంచి మద్దికుంట మీదుగా పచ్చునూర్ వరకు తారు లేచిపోయి కంకర తేలింది.

మరమ్మతులకు మోక్షమెప్పుడో..?



గుంతలమయంగా అమ్మనగుర్తి- కాట్రపెల్లి రోడ్డు

సైదాపూర్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు కంకర తేలి అధ్వానంగా మారాయి. మండలంలో ఎలబోతారం బొమ్మకల్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి గుంతలుగా మారింది. బొమ్మకల్ శివారులోని గుట్ట ప్రాంతం నుంచి నేషనల్ హైవేకు టిప్పర్లద్వారా మట్టి తరలిస్తుండడంతో రోడ్డు అధ్వానంగా మారింది. అమ్మనగుర్తి నుంచి కాట్రపెల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. పలు గ్రామాలు వెళ్లే అధ్వానంగా మారాయి. బొమ్మకల్ నుంచి గొడిశాల మధ్యలో ఉన్న లో లెవల్ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తోంది.

ఏళ్లుగా మరమ్మతులు కరువు



గుంతలమంగా మారిన ఆర్నకొండ నుంచి రాగంపేట రోడ్డు

చొప్పదండి: మండలంలోని గ్రామీణ రోడన్నీ దెబ్బతిన్నాయి. కొన్నేళ్లుగా రోడ్లకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారాయి. చొప్పదండిలోని ప్రధాన రహదారిని నాలుగు వరసులుగా అభివృద్ధిలో బాగంగా పనులను మొదలుపెట్టి మధ్యలో వదిలిపెట్టేశారు. ఈ రోడ్డు గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఆర్నకొండ నుంచి రాగంపేట, రేవెల్లి, గోపాల్‌రావుపేట రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి,చాకుంట వెదురుగట్టు రోడ్డు బాగా దెబ్బతిన్నది. రుక్మాపూర్ నుంచి కరీంనగర్ మండలం ఫకీరుపేట రోడ్డు వానాకాలంలో బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



ధర్మరాజుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. అడుగుకో గుంతతో, మూల మలుపులతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. మండలంలోని సిర్సపల్లి, వెంకట్రావ్‌పల్లె, పోతిరెడ్డిపేట, కనుకులగిద్దె, కందుగుల, జూపాక, ధర్మరాజుపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై గుంతలు పడ్డాయి.కనుకులగిద్దె, జూపాక, పెద్దపాపయ్యపల్లి, కాట్రపల్లి, సిర్సపల్లి, పోతిరెడ్డిపేట, వెంకట్రావ్‌పల్లె గ్రామాలకు వెళ్లే రోడ్లలో మూల మలుపులు ఎక్కువగా ఉన్నాయి. జూపాక, పోతిరెడ్డిపేట, కనుకులగిద్దె, తుమ్మనపల్లి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

పూర్తిగా దెబ్బతిన్న అంతర్గత రోడ్లు



ఆరెపల్లి-రేకుర్తి గ్రామాల మధ్య రైల్వే అండర్‌పాస్ వద్ద చెడిపోయిన రోడ్డు

కొత్తపల్లి: మండలంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలోని అన్ని గ్రామాలకు జిల్లా కేంద్రం నుంచి రోడ్డు సౌకర్యం ఉన్నా, గ్రామాల్లోని అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. మండలంలోని మల్కాపూర్, బద్దిపల్లి, బావుపేట, కమాన్‌పూర్, చింతకుంట, నాగులమల్యాల, ఖాజీపూర్, ఎలగందల్ గ్రామాల్లో కొత్తగా నిర్మించిన ఇళ్లకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరీంనగర్‌లో విలీనమైన తీగలగుట్టపల్లి నుంచి ఆరెపల్లి, రేకుర్తి వరకుఉన్న బైపాస్ రోడ్డు గుంతలమయమై వాహనాలు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. తీగలగుట్టపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపడుతుండడం, గేటు బాధతను తప్పించుకునేందుకు వాహనదారులు ఆరెపల్లి మీదుగా రేకుర్తి జగిత్యాలకు వెళ్తున్నా రోడ్డు సరిగా లేక పోవడంతో ఇబ్బందిపడుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23: ప్రజావాణి దరఖాస్తులను ఆలస్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 267 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

● వీధి కుక్కలు, కోతుల దాడులపై నేడు అవగాహన కార్యక్రమాలు

రోజు రోజుకు చిన్నారులపై వీధి కుక్కలు, కోతుల దాడులు పెరుగుతున్నందున మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాని ఆయా మండల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ సూచించారు. పశు సంవర్ధక శాఖ సిబ్బందితో కలిసి పాఠశాలలకు వెళ్లి దాడులకు గురవకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బూట్లు, సాక్సులను పంపిణీ చేస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో వాటి నాణ్యత పరిశీలించి, అందరికి అందినాయా లేదా వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. 2023 జూన్ నాటికి ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ పాల్గొన్నారు.

విలీన ప్రతిపాదనను విరమించుకోండి...

● దుర్శేడ్, గోపాల్ పూర్ గ్రామస్థుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న దుర్శేడ్, గోపాల్ పూర్ గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 23: కరీంనగర్ కార్పొరేషన్‌లో గ్రామాల విలీన ప్రక్రియను విరమించుకోవాలని దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఈ రెండు గ్రామాల ప్రజలు కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో విలీనం చేస్తే ఇంటి పన్నులు పెరగడమే కాకుండా ఉపాధి కోల్పోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ముద్దు, కార్పొరేషన్ వద్దంటూ ప్లకార్డులను ప్రదర్శించారు.ప్రజలపై పన్నుల భారం పడుతుందని తెలిపారు. విలీన ప్రతిపాదనలో ఉన్న దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు, కూలీలే ఉన్నారన్నారు. ఉపాధి హామీ కూలీలు 1500 మందికి పైగా ఉన్నారని, వారికి కూడా ఉపాధి దొరకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కరీంనగర్ మండలంలోని ఆరపల్లి, వల్లంపహాడ్, సీతరాంపూర్, పద్మనగర్, రేకుర్తి, గ్రామాలను విలీనం చేసినప్పటికి అభివృద్ధి చెందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న గ్రామాలు విలీనం చేస్తే అన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని గ్రామస్థులు తెలిపారు. విలీన ప్రక్రియను మానుకోక పోతే కార్యచరణ ప్రకటించి ఉద్యమిస్తామని, అవసరమైతే మంత్రుల ఇళ్ల ఎదుట నిరసనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, తోట తిరుపతి, గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ మంజుల మల్లారెడ్డి, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఆరె శ్రీకాంత్, గోనె నర్సయ్య, మంద రాజమల్లు, ఊరడి శివరెడ్డి, గాజుల అంజయ్య, ముస్కు మల్లారెడ్డి, మెండె శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణమాఫీపై త్వరలో స్పష్టమైన ప్రకటన

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజా సమస్యలపై వినతిపత్రాల స్వీకరణ



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, సెప్టెంబరు 23: నిబంధనల ప్రకారం రెండులక్షలలోపు రుణాలను మాఫీ చేశామని, రెండు లక్షల పైన రుణం ఉన్న రైతుల రుణమాఫీపై త్వరలోనే స్పష్టమైన ప్రకటన చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం సైదాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా_డారు. మండలంలోని రాములపల్లి-ఎల్లంపల్లి క్రాస్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి 88 లక్షలు, ఘన్‌పూర్-ఆకునూర్ వరకు రోడ్డు నిర్మాణానికి 23.07 లక్షలు, సీడీ వర్క్‌కు 57 లక్షలు, అమ్మనగుర్తి-వంగర వయా గుండలపల్లి బీటి రోడ్డు నిర్మాణానికి 3.17కోట్లు, పెర్కపల్లి-దుద్దెనపల్లి వెళ్లే రోడ్డులో హై లెవల్ వంతెన నిర్మాణానికి 3.47 కోట్లు, పెర్కపల్లి-వెన్కేపల్లి రోడ్డులో హై లెవల్ వంతెన నిర్మాణానికి 3.47 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.మండలంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారమే తమ ధ్యేయ మన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎప్పుడు ప్రజల్లో ఉంటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయా లన్నారు. ఈ సందర్భంగా మండలంలో వివిద సమస్యల పరిష్కారం కోసంసం వచ్చిన వారి వినతి పత్రాలను స్వీకరించారు. కొందరి సమస్యలను ఆయా అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కరిం చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కామిన వీరేశం, మాజీ ఎంపీటీసీ చాడ చైతన్య కొండల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు మిట్టపెల్లి కిష్టయ్య, నాయకులు మ్యాకల రవీందర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నియోజకవర్గంలో రోడ్డు లేని గ్రామం ఉండొద్దు

చిగురుమామిడి: హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్డు లేని గ్రామం ఉండొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్ల పనులకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని మూదిమానిక్యం నుంచి లంబాడిపల్లి రోడ్డు పనులకు గాను 1.22 లక్షలు, గాగిరెడ్డిపల్లి- లంబాడిపల్లి వయా బరిగెలపల్లిరోడ్డు పనులకు 28 లక్షలు, సుందరగిరి ఎక్స్ రోడ్డు నుంచి ఉల్లంపల్లి, మడత వరకు 10 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోని పలు మండలల్లో బ్రిడ్జిల నిర్మాణానికి 60 కోట్లు, పంచాయతీ రాజ్ ఎంఆర్ఆర్ గ్రాంట్ల ద్వారా 10 కోట్లు, పంచాయతీ రాజ్ సీఆర్ఆర్ ద్వారా 50 కోట్ల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, ఐరెడ్డి సత్యనారయణరెడ్డి, పోలు స్వప్న పాల్గొన్నారు.

మరమ్మతులు కరువు

● ఫ్లోరింగ్ కుంగి.. గుంతలు పడ్డ స్త్రీశక్తి, ఉపాధిహామీ భవనం
● మరమ్మతులు చేయాలని మహిళల వినతి


ఉపాధిహామీ భవనంలో కుంగిన ఫ్లోరింగ్


స్త్రీశక్తి భవనంలో లేచిన బండలు


సైదాపూర్ స్త్రీశక్తి, ఉపాధిహామీ భవనం

సైదాపూర్, సెప్టెంబరు 18: సైదాపూర్ మండల కేంద్రంలో ఐకేపీ సిబ్బందికి, ఉపాధిహామీ సిబ్బందికి కలిపి ఒకే చోట 2011వ సంవత్సరంలో భవనం నిర్మించారు. 2016 నవంబరు 26న అప్పటి రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభించి బిల్డింగ్‌ను ఉపాధిహామీ, ఐకేపీ అధికారులకు అప్పగించారు. కానీ ఆ భవణం సంవత్సరం గడువక ముందే ఫ్లోరింగ్ కుంగి బండలు లేచి గుంతలు ఏర్పడ్డాయి. గోడలు పగుళ్లు చూపాయి. పాములు తేళ్లు స్వైర విహారం చేస్తున్నాయి. అయినప్పటికి అప్పటి నుంచి ఆ బిల్డింగ్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు అధికారులు. మరమ్మతులు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక మహిళలు ప్రతి రోజు వచ్చే స్త్రీ శక్తి భవణం వద్ద సరైన మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారులు, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి స్త్రీశక్తి, ఉపాధిహామీ బిల్డింగ్ ఫ్లోరింగ్ మరమ్మతులు చేయాలని మహిళలు, ఉపాధిహామి, ఐకేపీ సిబ్బంది కోరుతున్నారు.

పేదరిక నిర్మూళన సంస్థ ద్వారా మహిళలకు, ఉపాధిహామీ ద్వారా వారి సిబ్బందికి నిత్యం ఏదో ఒక సమావేశం జరుగుతూనే ఉంటుంది. ఈ భవణాలు ఎప్పుడు రద్దీగా కనిపిస్తాయి. అలాంటి భవణాల్లో ఫ్లోరింగ్ గుంగడంతో, బండలు లేవడంతో మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

● విష పురుగులు స్వైర విహారం

స్త్రీశక్తి, ఉపాధిహామీ రెండు భవణాల్లో ఫ్లోరింగ్ కుంగడం, గోడలు పగలడంతో పాములు, తేళ్ల వంటి విషపురుగులు స్వైర విహారం చేస్తున్నాయి. ఒక రోజు ఏపీఎం టేబుల్ డ్రాలో పాము దూరింది. అటెండర్ టేబులు తూడిచేందుకు వెళ్లగా పాము బయటకు వచ్చిందని, దాంతో అటెండర్ బయపడి పరుగెత్తడంతో కింద పడిపోగా దెబ్బతగిలిందని సిబ్బంది తెలిపారు. అంతే గాక ఇంకొక రోజు దర్వాజపై పాము పడుకోవడంతో మహిళలు పామును చూసి పరుగులు తీశారని, వెంటనే కొందరు సిబ్బంది పామును చంపి వేశారని తెలిపారు. ఇంకో రోజు నీటి సంపులో పడి పాము చనిపోయిందన్నారు. ఈ కార్యాలయాలకు రావాలంటే భయం వేస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మరమ్మతులు కరువు

లక్షలు వెచ్చించి భవణాలు నిర్మించారు కానీ మరమ్మతు చేయడానికి వెనుకాడుతున్నారని, చర్యలు తీసుకోవడం లేదని మహిళా సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకోవాలని కోరుతున్నారు.

ఇక్కడకు రావాలంటే భయమేస్తుంది
- సమ్ము రజిత, సంతోషిమాత మండల సమైక్య అధ్యక్షురాలు, సైదాపూర్



స్త్రీ శక్తి భవనం ఫ్లోరింగ్ కుంగిపోవడం, ఫ్లోరింగ్ బండలు లేవడం, గోడలు పగుళ్లతో ఇక్కడికి రావాలంటేనే భయం వేస్తోంది. అంతేగాక పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. వెంటనే ఫ్లోరింగ్ మరమ్మతుతో పాటు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించాలి.

చెయ్యి విరగడంతో ఇబ్బంది పడుతున్నా
- వెంకటేష్, అటెండర్, ఐకేపీ సైదాపూర్



మాది పేద కుటుంబం. ఐకేపీలో అటెండర్‌గా పని చేస్తున్నా. చాలా సార్లు బండలు తట్టుకొని కింద పడ్డాను. చిన్న చిన్న దెబ్బలతో సర్దుకపోయాను. ఏపీఎం రూం వద్ద బండ తట్టుకొని పడడంతో చెయ్యి విరిగింది. విరిగిన చెయ్యితో ఇబ్బందిగా ఉంది. ఏ పని చేసుకోలేక పోతున్నా.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

ఎలిగేడు, సెప్టెంబరు 23: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన రంగు కొంరయ్య(51)అనే గీతకార్మికుడు సోమవారం సాయంత్రం తాటిచెట్టు పైనుంచి మోకు జారీ గాయాలపాలయ్యాడు. వృత్తిరీత్యా తాటికల్లు తీయడానికి కొంరయ్య చెట్టుపైకి వెళ్లాడు. దిగే క్రమంలో మోకుజారి కిందపడ్డాడు. దీనితో అతనికి కాలు, వెన్నుముకకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మహిళ అదృశ్యం

జ్యోతినగర్, సెప్టెంబర్ 23: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకే రామయ్య కాలనీకి చెందిన శ్యామల(35) అనే మహిళ కనిపించడం లేదు. కొన్ని నెలలుగా భర్త సంతోష్‌తో దూరంగా ఉంటున్న శ్యామల పీకే రామయ్య కాలనీలో ఉంటుంది. ఈ క్రమంలో భార్య శ్యామల వద్దకు భర్త సంతోష్ వచ్చి గొడవ చేశాడు. ఆ తర్వాత ఇంట్లో నుంచి వెళ్లిపోయిన శ్యామల ఇంటికి తిరిగి రాలేదు. శ్యామల తండ్రి రాజకొమరయ్య తన కూతురు కనిపించడం లేదని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

చొప్పదండి, సెప్టెంబరు 23: చొప్పదండి పట్టణ కేంద్రంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమికి తప్పుడు నివేదికలను ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌లు సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌కు ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణకుంట కుంట శిఖం భూమి యథేచ్ఛగా కబ్జాకు గురవుతుందని డీఈ, ఈఈలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదదని ఆయన పేర్కొన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తప్పులు చేసే అధికారులపై చర్యలు చేపట్టి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని వారు పేర్కొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్రం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 23: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీవుల్లా ఖాద్రి అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ పదేళ్ల క్రితం అధికారంలోకి రాక ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందన్నారు. దేశంలో 16శాతం నిరుద్యోగం ఉన్నదని, చదువుకు తగ్గట్టు ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అక్టోబరు 27, 28తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు లింగం రవి, పంజాల శ్రీనివాస్, మానస్‌కుమార్, మార్కపురి సూర్య, కనకరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ వలీవుల్లా ఖాద్రి

మందుబాబులకు జరిమానా


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రాజు

వేములవాడ, సెప్టెంబర్ 23 : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 71 మందికి వేములవాడ న్యాయస్థానం జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.రాజు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సందర్భంగా పట్టుబడిన 71 మందిని న్యాయమూర్తి జ్యోతిర్మయి ఎదుట ప్రవేశపెట్టామని, వీరిలో ఇద్దరికి రూ. 3500 రూపాయల చొప్పున, 20 మందికి 2500 రూపాయల చొప్పున, మిగతా జరిమానా 51 మందికి 1500 రూపాయల చొప్పున జరిమానా విధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారికి పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

చందుర్తి, సెప్టెంబర్ 23: చందుర్తి మండల కేంద్రంకు చెందిన ఓ యువకుడిని దూషించిన సంఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మర్రి రమేష్ అనే యువకుడు ఇంటి నిర్మాణం కోసం తీసుకు వచ్చిన ఇసుకతో పాటు ఇతర సామగ్రి ఆరుబయట నిల్వ చేశాడు.

ఈ క్రమంలో శనివారం రాత్రి పోతరాజు రవి అనే వ్యక్తి ఇసుక తొలగించాలని రమేష్‌ను దూషిస్తూ పాటు గొడ్డలి పట్టుకొని వెళ్లగా రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాబు తెలిపారు.

గురుకుల సమస్యలు పరిష్కరించాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు 23: గురుకుల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను జిల్లా యూటీఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరిధిలోని 700లకు పైగా గురుకులాలు అద్దె భవనాలలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నాయని అన్నారు. అశాస్త్రీయమైన పాఠశాల పనివేళలు సవరించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల విద్యార్థుల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో టీఎస్ యుటీఎఫ్, గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆశలవారీగా అందోళన కార్యక్రమాలు చేపడుతామని దీనిలో భాగంగా ఈనెల 28న హైదారాబాద్‌లో గురుకుల ఉపాధ్యాయులతో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు ముల్కల కుమార్, సెక్రటరీ జావీద్, నాయకులు భూపేందర్ కౌర్, తిరుపతి, స్వామి, శ్రీనివాస్, రత్నాకర్ పాల్గొన్నారు.

బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి జైలు శిక్ష

వీణవంక, సెప్టెంబర్ 23: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన జున్నుతుల మనోహర్‌రెడ్డి 2003లో టాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న జున్నుతుల రాజేశ్వర్‌రెడ్డి(9) అనే బాలుడికి గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా జున్నుతుల శ్రీనివాస్‌రెడ్డి, జున్నుతుల రాజేశ్వరమ్మ, చదువు శ్రీనివాస్‌రెడ్డి, చదువు వీరారెడ్డిలకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరస్తుడిని కోర్టులో ప్రవేశపెట్టగా హుజూరాబాద్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జున్నుతుల మనోహర్‌రెడ్డికి 19 నెలల జైలు శిక్షతో పాటు 6,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ పంతంగి శ్రీనివాస్,ఎస్ఐ తోట తిరుపతి, జమ్మికుంట రూరల్ సీఐ కోరే కిషోర్‌లను ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ నిలిపివేయాలి

శంకరపట్నం, సెప్టెంబరు 23: ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ నిలిపివేయాలని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ హనుమకొండ కార్యాలయంలో శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్‌తో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అధికారులకు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఇళ్ల పక్క నుంచే విద్యుత్ లైన్ వేయవద్దని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. పనులు వెంటనే నిలిపివేయాలని సీఎండీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కమర్షియల్ విద్యుత్ లైను ఊరు బయట నుంచి తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గంగాధర, సెప్టెంబరు 23: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అందించినట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంగాధర గ్రామానికి చెందిన మల్యాల రాజేందర్ తన వీవో 23 మొబైల్ ఈనెల 18 పోగొ ట్టుకున్నాడు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సోమవారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఐటీయూ సంఘర్షణ యాత్ర

వీణవంక, సెప్టెంబర్ 23: రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియూ అధ్వర్యంలో సంఘర్షణ యాత్ర చేపట్టారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ న్యాయ సంహిత చట్టం 106 రద్దు చేయాలన్నారు. జీవన భృతి 4500 కల్పించాలని డీజిల్,పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు పుణ్ణం,చెలికాని శ్రీనివాస్,పిల్లి రవి యాదవ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు



కప్‌ను అందుకుంటున్న విజేత మెదక్ బాలుర జట్టు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 23 : రాజ మూడు రోజులపాటు నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. టోర్నీలో మెదక్(బాలుర), నిజామాబాద్ (బాలికల)జట్లు విజయం సాధించాయి. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సెమీ ఫైనల్స్, ఫైనల్స్ 'నువ్వానేనా' అన్నట్లుగా జట్లు పోటీపడ్డాయి. ఫైనల్స్‌లో మెదక్, నిజా మాబాద్ బాలుర జట్లు తలపడగా మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ బాలికల జట్లు తలపడగా నిజామాబాద్ జట్టు గెలిచాయి. శనివారం సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానం, బతుకమ్మ ఘాట్ సమీపంలోని మైదానంలో టోర్నీ ప్రారంభించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి 19 బాలికలు, 19 బాలుర జట్లు తలపడ్డాయి. విజేతలకు డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఆటల్లో రాణించాలన్నారు. సాఫ్ట్ బాల్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అంజయ్య ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి అర్చన, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్రనాయకుడు లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం

చందుర్తి, సెప్టెంబరు 23 : చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి శివారులో 13ఏళ్ల బాలికను సోమవారం యువకుడు కిడ్నాప్ చేసేందుకు యత్రించాడు. బాలిక కుటుంబ సభ్యుల రాకతో సదరు యువకుడు మరో యువకుడితో కలిసి కారులో పరారయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని బొల్లెం చెరువు గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడు చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో కూలీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని తిమ్మాపూర్‌కు చెందిన బాలికను ఏడాదిగా వేధిస్తున్నాడు. సోమవారం ఉదయం బాలిక పాఠశాలకు వెళ్తుండగా ఆశిరెడ్డిపల్లి శివారులో మరో యువకుడితో కారులో వచ్చిన సతీష్ బాలికను పెళ్లి చేసుకోవాలని, లేకపోతే చంపేస్తానంటూ కొట్టి, బెదిరించాడు. కిడ్నాప్ చేసేందుకు యత్నించాడు. బాలిక ఒక్కసారిగా కేకలు వేయడంతో అటువైపు వచ్చిన ఓ యువకుడు గమనించి బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా యువకుడు కారులో పరారయ్యాడు. ఈ సంఘటనపై బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

పంట పొలాలపై కోతుల దాడులు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
- జనాలపై పెరుగుతున్న దాడులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



కమ్మరిపేటలో కోతుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

భీమారం, సెప్టెంబరు 23 : భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఆయా పంట పొలాలపై కోతులు దాడులు పెరుగుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటల్లో కోతులు దాడి చేయడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. కొందరు రైతులు కోతుల బెడద కారణంగా చిరుధాన్యాలు, కూరగాయలు పండించడం మానివేస్తున్నారు. భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని కమ్మరిపేట, వెంకట్రావుపేట, రాగోజీపేట, దేశాయిపేట, గోవిందాం, పసునూరు, మన్నెగూడెం గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని సైతం వరి గింజలు వలుచుకొని తినడంతో రైతులు అధికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కోతుల బెడద కారణంగా అన్నదాతలు చిరుధాన్యాలు, కూరగాయలు పండించడానికి కష్టాలు పడుతున్నారు. గత్యంతరంలేక వరిధాన్యం పండిస్తున్నారు.

జనాలపై పెరుగుతున్న దాడులు

గ్రామాల్లోని ఇళ్లల్లోకి కోతులు చొరబడి తినుబండారాలు, వివిధ వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. అడ్డు వచ్చిన జనాలపై తిరగబడి దాడి చేస్తూ గాయాల పాలు చేస్తున్నాయి. అలాగే ఇళ్ల పైకప్పు పెంకులను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారు. కిరాణ దుకాణ యాజమానులు దుకాణం ముందు గ్రిల్స్, రక్షణ వలయాలను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒంటరిగా ఉన్న వృద్ధులు, చిన్నారులపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలు అనేకం.

కోతుల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రతి రోజు రైతులు తమ పంట పొలాలను కాపాడుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ పొలాలను కాపాడుకోవడానికి విడతలవారీగా కాపలా కాస్తున్నారు. కొందరు రైతులు కుక్కలను వేలాది రూపాయలు వెచ్చించి తమ పంట పొలాల వద్ద కాపలాగా ఉంచుతున్నారు. మరికొందరు వానరాలను తరిమేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వందల ఎకరాల్లో జామ, మామిడి మొక్కలు ఉండేవి. కోతుల బెడద కారణంగా ఇవి ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయాయి. కోతుల నుంచి మమ్మల్ని కాపాడాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

చేనులో కాపలా కాస్తున్నాం..



మేము నలుగురం. మా మొక్కజొన్న చేనులో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా కాస్తున్నాం. ఎవరైనా భోజనం చేయడానికి ఇంటికి వెళ్తే కోతులు చొరబడి నష్టం కలుగజేస్తున్నాయి. ప్రభుత్వం మాకు సోలార్ ఫైల్డ్ పెన్సిల్ ఇప్పిస్తే మున్ముందు పంటలు వేస్తాం. లేదంటే వేయలేం.

- చెట్లపల్లి లింగారెడ్డి, రైతు

కోతుల బెడదతో మొక్కజొన్న వేయడం లేదు..



గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో మూడేళ్ల నుంచి మొక్క జొన్న పంట వేయడం లేదు. మూడు సంవత్సరాల క్రితం మొక్కజొన్న పంట వేస్తే ఒక్క సంచి కంకి కూడా ఇంటికి తీసుకుపోలేదు. ప్రభుత్వం కోతుల నుంచి రక్షణ కల్పించినట్లయితే మళ్లీ మొక్కజొన్న పంట వేస్తాను.

- చింతలపల్లి వెంకట రెడ్డి, రైతు, భీమారం

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 14,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 14,170 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

30లోగా బీఎస్సీ ఆనర్స్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 23: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ (డిజైన్ టెక్నాలజీ) నాలుగో సెమిస్టర్ విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా పరీక్ష రుసుం చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబర్ నాలు గో తేదీ వరకు చెల్లించాలన్నారు. పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ .. యువకుడి మృతి

ధర్మారం, సెప్టెంబరు 23 : మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన కూనారపు లక్ష్మణ్(36) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాల నుంచి లక్ష్మణ్ మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో తాగిన మత్తులో ఈనెల 19న క్రిమిసంహారక మందు తాగి ఆత్యహత్యా ప్రయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు లక్ష్మణ్ భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

● కాగా కూనారపు లక్ష్మణ్ గడ్డి మందు తాగడం వల్లనే మృతి చెందాడని అతడి కుటుంబ సభ్యులు పురుగుల మందు దుకాణం ఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను అడ్డుకుని విరమింపజేశారు.

చెట్టుకు ఢీకొన్న బైక్..

సుల్తానాబాద్, సెప్టెంబర్ 23 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టగా ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన శ్యామల రాజు, స్వరూప దంపతులు జీవనోపాధి కోసం పెద్దపల్లి వచ్చి స్థిరపడ్డారు. ఆదివారం వెదిరలో కుల సంఘం సమావేశం కోసం రాజు (30) తన ద్విచక్ర వాహనంపై వెదిర వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి పెద్దపల్లి వస్తున్నాడు. మార్గమధ్యలో సుల్తానాబాద్ బస్టాండ్ మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు రాజు భార్య స్వరూప సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రావణ్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 :కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఒకరు పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణంలోని చింతకుంట వాడకు చెందిన బొల్లారపు శివ ప్రసాద్ అనే వ్యక్తికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన శివ ప్రసాద్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : అనారోగ్యంతో బాధపడుతూ మునిగాల శ్రీనివాస్(50) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఒళ్లనొప్పులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న సిక్‌వాడిలో నివాసం ఉంటున్న ముని గాల శ్రీనివాస్ ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- 200 గ్రాముల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమామహేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు23 : దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలను ఇబ్రహీంపట్నం పోలీసులు 48 గంటలలో పట్టుకుని జైలుకు పంపారు. దొంగతనాలకు అలవాటు పడి దారి దోపిడీతో పాటు గంజాయి అమ్ముతున్న యువకులను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న రాత్రి కమ్మర్‌పల్లి మండలంలో ఉప్లూర్ గ్రామానికి చెందిన సుధాగోని గంగాధర్‌గౌడ్ తన వ్యానులో ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తుండగా బండలింగాపూర్ క్రాస్ రోడ్డువద్ద మూత్ర విసర్జన చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు గంగాధర్‌గౌడ్ వద్దకు వచ్చి దాడి చేసి తన వద్ద ఉన్న 5 వేల రూపాయలతో పాటు సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం ఇ బ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద అనుమానస్పదంగా బైక్‌పై వస్తున్న ముగ్గురిని ఆపి విచారించగా చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అలాగే బైక్‌లో తరలిస్తున్న 200 గ్రాములు గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వారిలో మేడిపల్లి గ్రామానికి చెందిన ఏనుగు వంశీ, మెట్‌పల్లి మఠం వాడకు చెందిన బైండ్ల వేణు, బండలింపూర్ గ్రామానికి చెందిన కైర వేంకటేష్‌లను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి బైకు, డబ్బు, సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రి మాండ్‌కు తరలించినట్లు తెలిపారు.. నిందితులను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ కుమార్, కిరణ్ కుమార్‌లను సిబ్బంది గంగాధర్, చైతన్యలను మెట్‌పల్లి డీఎస్పీ అభినందించారు.

జనావాసాల్లోకి కొండచిలువ



బకెట్‌లో ఉన్న కొండచిలువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23 : ఎల్లారెడ్డిపేట మండలం పదిర శివారులోని జనావాసాల్లోకి ఆదివారం రాత్రి కొండ చిలువ రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. భారీ కొండచిలువను చూసి కేకలు వేస్తూ పరుగులు పెట్టారు. ఓ యువకుడు 100 నంబర్‌కు డయల్ చేసి విషయాన్ని చెప్పాడు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు పాములు పట్టే వ్యక్తిని పిలిపించారు. సుమారు 2.30 గంటలపాటు శ్రమించి బకెట్ సహాయంతో కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం హరిదాస్‌నగర్ శివారులోని అటవీ ప్రాంతంలో కొండచిలువను వదిలి పెట్టినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు.

భూవివాదాల్లో ఎస్‌ఐపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : భూ వివాదాల్లో తలదూర్చి డబ్బులు తీసుకుని పంచాయితీలు చేసేవాడని ఒక ఎస్‌ఐపై సోమవారం పోలీస్ కమిషనర్‌కు సైదాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన భూ బాధితులు ఫిర్యాదు చేశారు. సైదాపూర్ మండల ఎస్‌ఐగా పనిచేసిన సమయంలో భూ దందాలపై డబ్బులు ఎక్కువ ఇచ్చిన వారికి మద్దతుగా ఉంటూ, నిజమైన భూ యజమానులకు అన్యాయం చేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటికి వచ్చి ఎస్‌ఐ బెదిరించినట్లు సీసీ కెమెరా ఆధారాలను కూడా సీపీకి అందజేశామని బాధితులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23: కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సంధ్య అనే మహిళ మానేరు జలాశయంలో టూరిస్ట్ బోట్‌లో టికెట్ తీసుకుని బోట్ రైడింగ్‌కు వెళ్లింది. బోట్ కొద్దిదూరం వరకు వెళ్లగానే వివాహిత ఒక్కసారిగా నీటిలోకి దూకింది. గమనించిన బోట్ డ్రైవర్, తోటి ప్రయాణికులు వెంటనే మహిళను రక్షించారు. అనంతరం లేక్ పోలీసులకు సమాచారం అందించారు. సదరు మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఏటీఎం దొంగల అరెస్టు



దొంగలు ఉపయోగించిన క్లిప్‌లు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23: ఏటీఎం మిషన్‌లో నగదు బయటకు వచ్చే చోట స్టీల్ ప్లేట్ లను అమర్చి ఖాతాదారులకు డబ్బులు కనిపించకుండా చేసి కొద్దిసేపటి తర్వాత ఆ డబ్బులను తీసుకుని మోసాలకు పాల్పడు తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠాకు చెందిన ఇద్దరు నింది తులను కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వ ర్యంలో పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిత్ పాల్, సత్యవీర్ సింగ్ అనే ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. హుజూరా బాద్‌కు చెందిన పేరుమల్ల భిక్షపతి ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని తారక్ హోటల్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో 10 వేల రూపాయలు డ్రా చేసేందుకు తన ఏటీఎం కార్డును పెట్టి పిన్ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత డబ్బులు రాకపోయేసరికి అతను వెళ్ళిపోయాడు. అప్పటికే ఇద్దరు వ్యక్తులు ఏటీఎంలో అనుమానాస్పదంగా కనిపించారు. ఆ తరువాత కొద్దిసేపటికి 10వేలు డ్రా అయినట్లుగా భిక్షపతికి మెస్సేజ్ వచ్చింది. అనుమానంతో బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. అయితే భిక్షపతి ఏటీఎంలోకి వెళ్లక ముందు నుంచే నిందితులు ఏటీఎంలో అడ్డావేసి డబ్బులు వచ్చే మార్గంలో స్టీల్ క్లిప్‌ను అమర్చారు. కాని భిక్షపతికి ఆ డబ్బులు బయటకు కనిపించకపోవటంతో అతను కార్డు తీసుకుని వెళ్లిపోయాడు. అక్కడే తచ్చాడుతున్న ఇద్దరు నేరస్థులు భిక్షపతి బయటకు వెళ్లిన తరువాత స్టీల్‌క్లిప్ సహాయంతో పదివేల రూపాయలను తీసుకొని పారిపోయారు. ఏటీఎంలో సీసీ కెమెరాల పుటేజీలు, ఇతర ఆధారాలతో నిందితులను పోలీసులు పట్టుకుని కటకటాల్లోకి పంపించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- నాడు తండ్రి, నేడు తల్లి మృతి
- అనాథలైన చిన్నారులు



ప్రహర్ష (ఫైల్)



అనాథలైన చిన్నారులు

మానకొండూర్, సెప్టెంబరు 23 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మానకొండూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ గ్రామానికి చెందిన కొండ్ర పవన్ కల్యాణ్ ఇదే గ్రామానికి చెందిన ప్రహర్ష ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె ఆద్యశ్రీ, కుమారుడు అయాన్స్‌లు జన్మించారు. కూలీ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకున్నారు. పది నెలల క్రితం పవన్ కల్యాణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రహర్ష కరీంనగర్‌లోని ఓ షోరూంలో ఉద్యోగం చేస్తూ కుమారుడు, కుమార్తెను స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఒకటవ తరగతి, నర్సరీ చదివిస్తోంది. సోమవారం ఉదయం పిల్లలను తయారు చేసి పాఠశాలకు పంపిన ప్రహర్ష బహిర్భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మామ లక్ష్మయ్య వెళ్లి చూడగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. ప్రహర్ష బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్న సమాచారంతో గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరకుకొని బావిలో నుంచి మృతదేహన్ని బయటికి తీయించారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలను చూసి గ్రామస్తులు బోరున విలపించారు. మృతురాలి సోదరి ప్రసన్న ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షోరూంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఏమైనా జరిగిందా లేదా మృతికి కారణాలపై అనుమానాస్పద స్థితిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు. నాడు తండ్రి నేడు తల్లి మృతిచెందడంతో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలను చూసి బంధువులు, గ్రామస్థులు తీవ్రంగా విలపించారు.

సమ్మిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, నాయకులు

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 23 : జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్లో తుమ్మేటి సమ్మిరెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ దివంగత నేత ఎమ్మెస్సార్ మనువడు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌లతో కలిసి మంత్రి హాజరయ్యారు. సమ్మిరెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, నాయకులు నివాళులు అర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఈ ప్రాంత రైతాంగం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి తుమ్మేటి అని కొనియాడారు. ఎమ్మెస్సార్ శిష్యుడిగా కాంగ్రెస్‌లో కొనసాగారని, అలాంటి వ్యక్తి ఆకస్మికంగా మరణించడం కాంగ్రెస్‌కు తీరని లోటు అన్నారు. అనంతరం మారుతినగర్‌లోని పిడుగు గట్టయ్య నివాసానికి వెళ్లారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 : మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో ఒకరికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ సోమవారం తీర్పు వెలువరించారు. పాత గూడూరు గ్రామానికి చెందిన కొరవేని పెద్దిరాజు అతిగా మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు.

విద్యుత్ మోటార్ల చోరీ

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 23 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుసగా విద్యుత్ మోటార్లు చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళనకు గురువుతున్నారు. వరుసగా మూడు రోజులుగా ద్యాగల లక్ష్మిరాజం, ఎడమల సహదేవ్, బుయ్య కిషన్‌లకు చెందిన విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితులు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వీణవంకలో దొంగల హల్‌చల్

● రెండు దుకాణాల్లో చోరీ



ఐరన్ షాపులో ధ్వంసం చేసిన సీసీ కెమెరాలు

వీణవంక సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఎలక్ట్రికల్ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాప్‌తో పాటు నల్ల పోచమ్మ షాప్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. షట్టర్స్ పగులగొట్టి రెండు షాపుల్లో చొరబడిన దొంగలు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఐరన్ షాపులో దాదాపు 14వేల రూపాయల నగదు చోరీ చేసి షాప్‌లోని పలు సామాన్లు ధ్వంసం చేశారు. నల్ల పోచమ్మ వైన్‌షాప్‌లో 35 వేల విలువైన మద్యం బాటిళ్లు చోరీ చేశారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌లు ఎత్తుకెళ్లారు. వైన్స్ షాప్ యజమాని దాసం రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తోట తిరుపతి తెలిపారు.

అడవి జంతువుల దాడిలో వరి పంట ధ్వంసం



అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంట

కోనరావుపేట, సెప్టెంబరు 23 : కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామ శివారులో అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసమైంది. గ్రామానికి చెందిన మారుపాక లింగయ్య అనే రైతుకు చెందిన రెండు ఎకరాల వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతు తెలిపాడు. అటవీశాఖ అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 : కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన జేరుపోతుల అంజనేయులు(45) మృతి చెందాడని కరీంనగర్‌రూరల్ పోలీసులు తెలిపారు. అంజనేయులు దుర్శేడ్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకవైపు నుంచి ఒక కారు అతివేగంగా ఢీకొనగా తల, ఇతరచోట్ల తీవ్ర గాయాలయ్యాయని, స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా మృతుడి కళ్ళను సోమవారం కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది ఆంజనేయులు నేత్రాలను సేకరించి ఆసుపత్రికి తరలించారు.

కోరుట్లలో..

కోరుట్ల, సెప్టెంబరు 23 : పట్టణంలోని జీఎస్ గార్డెన్ సమీపంలోని జాతీయ రహ దారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎసీకోని గుట్ట ప్రాంతానికి చెందిన పెంట మక్కయ్య (47) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మక్కయ్య ఎసీకోని గుట్ట ప్రాంతం నుంచి కోరుట్లకు టీవీస్ ఎక్స్‌ఎల్ (ఏపీ 15 ఎక్స్ 2518) నంబర్‌గల ద్విచక్ర వాహనంపై వస్తుండగా జీఎస్ గార్డెన్ సమీపంలో అగి ఉన్న లారీని ఢీ కొట్టి గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు పట్టణంలోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్యలో మక్కయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పెర్కొన్నాడు.

భవన నిర్మాణ కార్మికుడి..

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 23 : మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన బోమ్మ రవి(46) అను భవన నిర్మాణ కార్మికుడు సోమవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రవి భవన నిర్మాణ కార్మికుడిగా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 18న మెట్‌పల్లి పట్టణంలో పనులు ముగిసించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మెట్ల చిట్టాపూర్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కుక్కను ఢీకొని కింద పడ్డాడు. దీంతో రవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలపడంతో మెట్‌పల్లి ఆసపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం నిజామాబాద్‌కు తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో సోమవారం ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో మార్గ మధ్యలోనే మృతి చెందాడు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూడో ఎంపిక పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాల జూడో ఎంపిక పోటీలకు భారీ స్పందన లభించింది. అండర్-14 విభాగంలో బాల, బాలికలకు కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో సెలెక్షన్స్ నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి భాషవేణి వేణుగోపాల్ తెలిపారు. ఎంపిక పోటీల్లో 75మంది బాలికలు, 100 మంది బాలురు పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25నుంచి హన్మకొండలో జరిగే 68వ తెలంగాణ రాష్ట్ర జూడో పోటీల్లో పాల్గొంటారన్నారు.

'లా కాలేజీపై చర్యలు తీసుకోవాలి'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 23: నిబంధనలు పాటించని కరీంనగర్‌లోని జస్టిస్ కొమరయ్య లా కాలేజీపై చర్యలు తీసుకోవాలని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ కాలేజీలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి మొదటి సంవత్సరం స్పెషల్ ఫీజు 7000 రూపాయలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు హేమంత్, రాము యాదవ్, యూనివర్సిటీ ఇన్‌చార్జి మర్రి కల్యాణ్ నాయకులు సన్నీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలను సేకరిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 23: ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం కళాకారులు కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్ ప్రాంతంలో సోమవారం విరాళాల సేకరణ చేపట్టారు. జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం కరీంనగర్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షులు అనువోజు వెంకటేశం పిలుపుమేరకు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం డప్పు సప్పులతో పాటలతో కళాకారుల ఆటపాటలతో విరాళాలను సేకరించామన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గజ్జె కట్టి గళం విప్పిన మాకు అన్యాయం జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి జలపతి, ఉపాధ్యక్షులు మునిగంటి సతీష్, ప్రధాన కార్యదర్శి డోలక్ రాజు, కరీంనగర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గజ్జల వినోద, వరాల వెంకన్న, గోలాడ సత్యం, న్యాలం రఘురాం గౌడ్, మచ్చ బాబు, బండారి శంకర్, ఉప్పు ఆదిత్య, మచ్చ మహేష్, ఎండి అలీమ్, గోనెల సమ్మన్న, మధు, కుమార్, చందు, మడ్డి రవిచందర్, కళాకారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 23: నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమం, స్వధార్ హోమ్‌లను జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ సందర్శించారు. సోమవారం ఆయన ఆశ్రమంలోని వృద్ధులు, వికలాంగులతో ముచ్చటించి ఏర్పాట్లతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు సరైన వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి'

సుభాష్‌నగర్, సెప్టెంబరు 21: ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న పేషంట్ల వద్ద ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యాలను అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరేష్, సహాయకార్యదర్శి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

డీఈవో, ఎంఈవోలపై విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23: జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారిపై విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ)జిల్లా కార్యదర్శి సంద గణేష్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి కుమ్మక్కై ప్రైవేటు విద్యాసంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

అభ్యుదయ మాల సంఘం అధ్యక్షుడిగా రవీందర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23: అభ్యుదయ మాల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దండి రవీందర్, ఉపాధ్యక్షులుగా గంజి శ్రీనివాస్, యాదగిరి ప్రధాన కార్యదర్శిగా ఇస్కుల్ల కృష్ణ, సహాయ కార్యదర్శులుగా ఎగ్గడి జగన్, గంజి రమేశ్, కోశాధికారిగా రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా సుధీర్, రాసూరి కనకయ్య, లింగయ్య, రాజ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలో వొడితల ప్రణవ్ నివాస గృహానికి మంత్రి సోమవారం రాత్రి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా ప్రయత్నం చేస్తూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ప్రణవ్ సేవలందిస్తున్నారన్నారు. ప్రత్యర్థుల ఉనికి చాటుకునే రాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని అన్నారు. అర్హులైన రైతులకు తప్పనిసరిగా రుణమాఫీ అవుతుందన్నారు. తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనిని తొమ్మిది నెలలలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ విప్ అడ్లూరి లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

హుజూరాబాద్, సెప్టెంబరు 23: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో సోమవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సొల్లు సారయ్య, హెచ్ఎంలు శోభారాణి, తిరుమల, శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వేణు, పీడీ నర్సింహ, శ్రీనివాస్, రేణుక, సత్యనందం, అనిల్‌కుమార్, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబర్ 23 : వందరోజుల వికసిత్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమంలో సోమవారం కాట్రపల్లి రైతులకు అవగాహన కల్పించారు. కెవికె జమ్మికుంట-వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. కెవికె శాస్త్రవేత్తలు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రసాయినక వ్యవసాయ పరిస్థితులు, సేంద్రియ ప్రకృతి వ్యవసాయం అవశ్యకతను వివరించారు. వరి, పత్తి పంటలలో వస్తున్న చీడపీడలు, తెగుళ్ల వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో నిఖిల్‌కుమార్, రైతులు ఉన్నారు.

వాగేశ్వరిలో అవగాహన సదస్సు

తిమ్మాపూర్, సెప్టెంబరు23: స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో సోమవారం ఫార్మకో విజిలెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో చెల్మెడ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆసిమ్ అలీ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఔషధ దుష్ప్రభావాల గురించి వివరించారు. కార్యక్రమంలో వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య కళాశాల విభాగాధిపతి పుష్పలత, అధ్యాపకులు అనిల్, శ్రవన్ కుమార్, పవన్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

● వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో స్వావలంబి భారత్ అభియన్ వారి సహకారంతో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సోలార్ ఎంటర్‌ప్రెన్యూర్ ఎండి ఇంద్రసేనారెడ్డి, జుపిటర్ క్యాపిటల్స్ ఎండి, సీఈఓ గండె సుధాకర్ పాల్గొని మాట్లాడారు.

'తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు'



భగత్‌నగర్ రిజర్వాయర్‌లో మంచినీటిని పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 23: నగర ప్రజలకు తాగునీటి అందించే విషయంలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు మున్సిపల్ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం ఆయన భగత్‌నగర్ మంచినీటి రిజర్వాయర్‌ను సందర్శించి, సరఫరా చేస్తున్న తాగునీటిని, వాటర్ సంపు, ప్యానల్ బోర్డు, మోటారు పంపులు, లీకేజీ వాల్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లోలెవల్, హైలెవల్ జోన్ల పరిధిలోని అన్ని రిజర్వాయర్లలో సంవత్సరంపాటు నిర్వహణ, మరమ్మతులకు అయ్యే అంచనాలను తయారు చేసి వాటికి టెండర్లను పిలవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్ ప్రహరీగోడ శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో ప్రహరీగోడ నిర్మాణం చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాల్ లీకేజీలు, పైపులైన్ల లీకేజీలను వెంటవెంటనే గుర్తించి వాటికి మరమ్మత్తు చేయాలని, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నీరు సరఫరా చేస్తున్న సమయంలో ఏఈ స్థాయి అధికారితో పాటు లైన్‌మెన్, ఫిట్టర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, ఫిల్టర్‌బెడ్స్, రిజర్వాయర్‌లో, పైపులైన్లలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా పరిష్కరించాలని ఆదేశించారు. రిజర్వాయర్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్యానల్ బోర్డును వెంటనే మరమ్మత్తు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఈఈ అయాబ్‌ఖాన్, ఏఈ గట్టు స్వామి, మెతుకు సత్యం పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 23: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ స్కూల్‌కు చెందిన విద్యార్థి జి దేవ ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా ముచ్చింతల్‌లోని బహుమతిని దేవ చిన్న జీయర్‌స్వామి చేతుల మీదుగా అందుకున్నాడు. కాగా విద్యార్థిని సోమవారం పాఠశాలలో విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య, ఏఓ తుంగాని సంపత్, తల్లిదండ్రులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

వ్యాసరచనలో పారమిత విద్యార్థిని ప్రతిభ

భగత్‌నగర్, సెప్టెంబరు 23: నగరంలోని పారమిత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతికి చెందిన కె శ్రేష్ఠ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ప్రజ్ఞ వికాస్ తరంగిణి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో మాతృభూమికి కృతజ్ఞత అనే అంశంపై జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థినిని పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు, డైరెక్టర్లు అభినందించారు.

తెలంగాణ సాహితి జిల్లా కార్యకర్తల సమావేశం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 23: తెలంగాణ సాహితి జిల్లా శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ శంకర్ అధ్యక్షతన సోమవారం కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ ఆసంపల్లి లక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని నిర్వహించాలని, ఈ నెల 28న సాయంత్రం 6 గంటల నుంచి సప్తగిరికాలని బైపాస్‌రోడ్‌లో గల ఎస్ఆర్ఆర్ బంక్వెట్ హాల్‌లో జాషువా సాహిత్య పద్య పఠనం-కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కవులకు సన్మానం ఉంటుందని తెలిపారు. హాజరయ్యేవారి పేర్లను ఈ నెల 26వ తేదీ లోపు 9701189242, 9441595655, 8897430904 నెంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ముస్లిం శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 23 : కాపువాడలోని ముస్లిం శ్మశానవాటిక భూమిని సర్వే చేసి కబ్జా నుంచి రక్షించాలని కలెక్టర్‌కు కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి వరంగల్‌లో నిర్వహించనున్న అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ కోసం జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి మనోహర్‌రావు తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక కోసం నిర్వహించిన పోటీల్లో 140 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 18 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అజిత్‌రావు, కె మహేందర్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 23: కేంద్రం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని గీతాభవన్ చౌరస్తాలో సిఐటియు, ఏఐటియుసి ఐఎఫ్‌టియు, పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త బ్లాక్ డే కార్యక్రమాం సందర్భంగా నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసికార్మిక వ్యతిరేక స్వదేశీ ,విదేశీ గుత్త కంపెనీలకు అనుకూలమైన ధనవంతులకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడులను తేవడం జరిగింది. దీన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా అనేక సమ్మెలు నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, యు శ్రీనివాస్,సత్యం, శ్రీనివాస్, సిహెచ్ శ్రీధర్, విద్యాసాగ ర్,అంజయ్య నాయకులు కిరణ్, రాములు, వెంకటేష్, సింగరేణి పెన్షనర్ అసోసియేషన్ నాయకులు, ప్రభాకర్ రెడ్డి, నాయకులు రవి, పోచయ్య, లింగారెడ్డి,నాయకులు సంపత్,యశ్వంత్, ఎల్లయ్య పాల్గొన్నారు.

మార్చిలోగా స్మార్ట్ సిటీ పనులు పూర్తిచేయాలి

- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 23: స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టులో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ మార్చి-2025లోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఆర్వీ కన్సల్‌టెన్సీ అధికారులు, వివిధ ప్రాజెక్టుల ఏజెన్సీ కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు మార్చి, 2025లో ముగియనున్నందున ఆలోగా పనులన్నీ పూర్తయ్యేలా వేగం పెంచాలని సూచించారు. ప్రధానంగా 24/7 వాటర్ సప్లయి, మల్టిపర్పస్ పార్కు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డిజిటల్ లైబ్రరీ, కాశ్మీరుగడ్డ, పద్మనగర్ సమీకృత మార్కెట్లు, టవర్‌సర్కిల్ ఆధునీకరణ పనులు, రేయిన్ వాటర్ హార్వెస్టింగ్, స్మార్ట్ ఈ క్లాస్ రూమ్స్ దోబీఘాట్ తదితర పనులన్నిటిని వేగవంతంగా పూర్తిచేయాలని అన్నారు. ఇప్పటి వరకు 750 కోట్ల రూపాయల విలువ చేసే పనులు పూర్తయ్యాయని, ఇంకా 250 కోట్ల రూపాయల పనులు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, డీఈలు వెంకటేశ్వర్లు, ఓంప్రకాశ్, అయూబ్‌ఖాన్, శ్రీనివాస్, ఆర్వీ అధికారి సందీప్, ఏఈలు వివిధ ప్రాజెక్టుల ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీకి పొట్టిశ్రీరాములు పేరు కొనసాగించాలి



మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 23: తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టిశ్రీరాములు పేరును మార్చడం విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ కోరారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందినవారు కాదని గుర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు నగునూరి రాజేందర్, యువ జన విభాగం జిల్లా అధ్యక్షుడు జిడిగె సాయికృష్ణ, జిల్లా కోశాధికారి పడకంటి శ్రీనివాస్, నగర ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్, మహిళా జిల్లా అధ్యక్షురాలు చకిలం స్వప్న, మాజీ కార్పొరేటర్ రావికంటి భాగ్యలక్ష్మి, మాజీ ప్రధాన కార్యదర్శి శివనాథుల శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ మంచాల సుధాకర్, పొలిటికల్ చైర్మన్ రామిడి శ్రీధర్, సేవాదళ్ చైర్మన్ మునీందర్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

● ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు
● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రైతులు



విద్యార్థులకు బూట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శంకరపట్నం, సెప్టెంబరు 23: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం శంక రపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ లక్ష రూపాయలలోపు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. శంకరపట్నం మండలంలో సుమారు 9వేల మంది రైతులు రుణాలు తీసుకుంటే సుమారు 5వేల మందికి రుణమాఫీ జరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారానే మిడ్ మానేరు, అనంతగిరి, రంగనాయకసాగర్, కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టులకు నీరు పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీవో ప్రభాకర్, సీడీపీవో శ్రీమతి, సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, శ్రీమత్స్యగిరీంద్ర స్వామి ఆలయ చైర్మన్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

- తాము రుణమాఫీకి అర్హులైనప్పటికీ ఎందుకు రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కన్నాపూర్ రైతులు ప్రశ్నించారు.

- అర్హులైన వారు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. పోషకమాసం సందర్భంగా శంకరపట్నం రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

● మానకొండూర్ : బూట్ల పంపిణీతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం బూట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల సంక్షేమంతో పాటు విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలతో మధ్యాహ్న భోజనం,నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఈవో జనార్ధన్‌రావు, కో-ఆర్డినేటర్ అశోక్, ఎంఈవో మధుసుధనచారి, ఏఎంసీ అధ్యక్షులు మర్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి'

సైదాపూర్, సెప్టెంబరు 23: గడిచిన 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ సైదాపూర్ మండలానికి అనేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశారని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య పేర్కొన్నారు. సోమవారం సైదాపూర్ మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌పై అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తొమ్మిది నెలల్లో ఏం చేశారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. దొడ్డు వడ్లకు కూడా రూ.500ల బోనస్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావుల రవీందర్‌రెడ్డి, భత్తుల లక్ష్మీనారాయణ, పైడిపెల్లి రవీందర్, వర్నె మోహన్‌రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేయాలని బీజేపీ నిరసన



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చొప్పదండి, సెప్టెంబరు 23: చొప్పదండి, ఆర్నకొండలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరుతూ బీజేపీ నాయకులు, లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 169 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్‌రూమ్‌ల పనులు మధ్యలో నిలిపివేశారని దీనిపై ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి చెపురి సత్యనారాయణ, బత్తిని ప్రశాంత్ పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



కార్యక్రమంలో పాల్గొన్న కౌశిక్‌రెడ్డి, వినోద్‌కుమార్

జమ్మికుంట, సెప్టెంబర్ 23: ఎన్నికల తర్వాత ఇస్తామన్న దళితబంధు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండవ విడత అర్హులైన వారికి దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులను వెంటనే జమ చేయాలన్నారు. రైతు రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం, దేవాదులతో పాటు ఎన్నో ప్రాజెక్టులను నిర్మించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక రూపాయి ఖర్చు లేకుండా సోలార్‌తో పంపులు నడుస్తాయన్నారు. అనంతరం ఎంపీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి, మాజీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 23: నగరంలో విద్యుత్ మరమ్మతులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు టౌన్ టు, ఏడిఈ, సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు సంతోష్ నగర్, విద్యా నగర్, బాలాజీ సూపర్ మార్కెట్, సెయింట్ రూన్ స్కూల్ ఏరియా, శక్తి టెంపుల్, ఏరియా వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 23: కరీంనగర్ ప్రభుత్వ ఐటిఐలో నాలుగు విడతల్లో భర్తీచేసిన తర్వాత మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఆసక్తిగల విద్యార్థులు తెలంగాణ వెబ్‌సైట్‌లో రూ.100 ఫీజు చెల్లించి ఈనెల 28లోగా దరఖాస్తు సమర్పించాలని సూచించారు. వివరాలకు 7799100360, 9666252060 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భగత్‌నగర్, సెప్టెంబరు 23: కొత్తపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 1990-91 సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. 34 సంవత్సరాల తర్వాత తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితులు అందరు ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, మరణించిన స్నేహితుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

'తిరుమల లడ్డూ కల్తీ జరగడం దురదృష్టకరం'

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 23 : తిరుమల తిరుపతిలో లడ్డు కల్తీ జరగడం అత్యంత దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమలలో లడ్డు కల్తీ కావడం, దీనికి సంబంధించిన అపచారంలో బీజేపీకి భాగస్వామ్యం ఉందనే అనుమానాలు ప్రజల్లో తలెత్తుతున్నాయని అన్నారు.

ఆలయాల హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 23: దేవాదాయశాఖ పరిధిలో గల రెండు ఆలయాల హుండీలను ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ పాము సత్యనారాయణ పర్యవేక్షణలో సోమవారం లెక్కించినట్లు ఆయా ఆలయాల ఈఓ నాగారపు శ్రీనివాస్ తెలిపారు. 6 నెలలకు గాను మంకమ్మతోట వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీల ఆదాయం 1,55,257 రూపాయలు రాగా, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ హుండీల ఆదాయం 90,321 రూపాయలు వచ్చినట్లు పేర్కొన్నారు. లెక్కింపులో వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త పిట్టల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల విలీన ప్రతిపాదన విరమించుకోవాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 23: శివారు గ్రామాలను నగర పాలక సంస్థలో విలీనం చేస్తామనే ప్రతిపాదనను విరమించుకోవాలని మల్కాపూర్ గ్రామ సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణ సమీపంలోని శివారు గ్రామమైన మల్కాపురం గ్రామాన్ని నగర పాలక సంస్థలో విలీనం చేస్తు ప్రతిపాదించడంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

అభివృద్ధి కోసమే గ్రామాల విలీనం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబర్ 23 : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మహానగరంగా మరింత అభివృద్ధి చెందేందుకే రా: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 6 శివారు గ్రామాలతోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీని కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు ప్రతిపాదించారని టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేత్ర దానం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 23: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన జేరిపోతుల ఆంజనేయులు (45) దుర్శేడ్ బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించగా అతని కోరిక మేరకు కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. ఎల్వీ ప్రసాద్ వైద్యశాల సిబ్బందిచే నేత్రాలను సేకరించి వైద్యశాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జేరిపోతుల యశ్వంత్, జేరిపోతుల సాయిచరణ్, పోగుల సుమన్, లయన్స్‌క్లబ్ సభ్యులు ఇంజనీర్ కోల అన్నారెడ్డి, చింతల కిషన్ పటేల్, గాజుల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ స్పోర్ట్స్: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగినటువంటి జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్యాంప్ సెలక్షన్స్‌లో ఎస్ఆర్ఆర్ కళాశాల లో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.అనిల్ జాతీయస్థాయిలో హిమాచల్ ప్రదేశ్ లో అక్టోబర్ 22న జరిగే ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై సత్యనారాయణ అభినందించారు.

●భగత్‌నగర్: మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు మానవాళికి దిక్సూచి అని మజ్లీస్ తహపుజ్ ఖత్మే నబువత్ రిలీజియస్ ట్రస్టు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం రేకుర్తిలోని ఫాతిమా మస్జీద్, షేకాన్ మస్జీద్‌లో మహమ్మద్ ప్రవక్త జీవితం చరిత్రపై ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాతిమా హాఫిజ్ అహ్మద్ హిఫ్జీ, హఫీజ్‌షేక్ పరీదొద్దీన్ పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో బీకాం, బి.బి.ఎ విద్యార్థులకు ట్యాలీ-జిఎస్‌టీపై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు డాక్టర్.సి.హెచ్.శ్రీనివాస్ తెలిపారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన మానసిక సమస్యతో బాధపడుతున్న బాలుడిని జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్ర ప్రసన్న జిల్లా స్వతంత్ర సమరయోధుల ట్రస్ట్ ప్రత్యేక పాఠశాల ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి అందులో చేర్పించారు. ఆమె వెంట జిల్లా మహిళ కాంగ్రెస్ కార్యదర్శి నేరేళ్ల కవిత, రాజు, సాయిమణి, బాలుడి తల్లిదండ్రులు నారాయణ, పద్మ తదితరులు ఉన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సాహితి ఫౌండేషన్ సభ్యులు సూచించారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం డ్రగ్స్ నియం త్రణ, వాటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సాహితీ ఫౌండేషన్ చైర్మన్ రాముల కుమార్, డాక్టర్ ఆస్పియా కుల్సుం,ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మహ మ్మద్ అకుంష్, కిట్స్ కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొలిపాక రమేష్ ఉన్నారు.

● గంగాధర: గర్షకుర్తికి చెందిన దాసరి వైష్ణవికి గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ సభ్యులు మిట్టపల్లి రాజశేఖర్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ కొనుగోలు చేసి సోమవారం అందించారు. క్లబ్ సభ్యులు మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, గుర్రం బాపురెడ్డి,అన్నల్‌దాస్ శ్రీనివాస్,అనిల్, రమేష్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

● వీణవంక:మండలంలోని కొండపాక గ్రామ మాజీ ఎంపీటీసీ అవాల మణెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్,నాయకులు బండా శ్రీనివాస్,ముసిపట్ల తిరుపతి రెడ్డి,కాసర్ల సుధాకర్ తదితరులున్నారు.